ప్రజాశక్తి
గురువారం 17, నవంబర్ 2022 5 అనంతపురం

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి : జడ్పీ సీఈవో

బెలుగుప్ప : మండలవ్యాప్తంగా హౌసింగ్ నిర్మాణాలు, ఆర్‌బికె కేంద్రాలు, సచివాలయాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జడ్పీ సీఈవో భాస్కర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని బెలుగుప్ప, కాలువపల్లి, గంగవరం, వెంకటాద్రిపల్లి, శిర్పి గ్రామాల్లో నిర్మాణంలోఉన్న ఇళ్లు, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇంతవరకు లబ్ధిదారులు పునాదులు కూడా వేసుకోకుంటే వారికి అవగాహన కల్పించి ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ 21వతేదీ లోపు హౌసింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బెలుగుప్ప సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, ఎంపిడిఒ యాదవేంద్ర, జడ్పిటిసి భర్త త్రిలోక్‌నాథ్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ శివలింగప్ప, హౌసింగ్ ఎఇ శివారెడ్డి, జెఇ సుధాకర్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి

రాయలసీమ అభివృద్ధికి ఐక్య ఉద్యమం

రాయలసీమ సదస్సులో సిపిఎం పిలుపు
పది అంశాలపై తీర్మానం

ప్రజాశక్తి-అనంతపురం

అత్యంత వెనుకబడిన రాయలసీమ సమగ్రాభివృద్ధికై ఐక్య ఉద్యమాలు చేపట్టాలని సిపిఎం రాయలసీమ సదస్సులో తీర్మానించారు. 'రాయలసీమ సమగ్రాభివృద్ధి–ఆటంకాలు' అన్న అంశంపై సిపిఎం ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలోని గుంతకల్లు పట్టణంలో రెండు రోజుల పాటు సదస్సు జరిగింది. ఈ సదస్సు బుధవారం నాడు ముగిసింది. అనంతరం సదస్సులో చర్చించిన అంశాలు, తీర్మానాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి, అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్‌లు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు రోజుల సదస్సుల్లో రాయలసీమ వెనుకబాటుతనం, సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పది అంశాలపై తీర్మానాలు చేశారు. తీర్మానాల వివరాలు ఈ విధంగానున్నాయి.

1. రాయలసీమ సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.50 వేలకోట్లు కేటాయించాలి. మూడు సంవత్సరాల్లో ఈ నిధులు ఖర్చు పెట్టాలి.
2. రాయలసీమలోని ప్రతిపాదిత ప్రాజెక్టులన్నీ మూడు సంవత్సరాలలో పూర్తిచేయాలి. ఈ ప్రాంత సాగుభూమికి సంవత్సరానికి ఒక్క పంటకైనా నీరివ్వాలి.
3. రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 20 సంవత్సరాలు పన్ను రాయితీ కల్పించాలి.
4. కడప జిల్లాలో ప్రభుత్వరంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి.
5. అనంతపురంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం, బెల్, నాసిన్ సంస్థలు పూర్తి చేయాలి. కర్నూలులో రూ.400 కోట్లతో ట్రిపుల్‌ఐటి, రైల్వేకోచ్ నిర్మాణ పరిశ్రమ స్థాపించాలి. తిరుపతిలో కండలేరు ప్రాజెక్టు, చిత్తూరులో చెన్నై–విశాఖ పారిశ్రామిక కారిడార్ హామీ అమలు చేయాలి.
6. వృత్తిదారులకు రక్షణ కల్పించాలి. చేనేతలో 11 రకాల రిజర్వేషన్లు అమలుచేయాలి. ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ పటిష్టంగా అమలు జరపాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ద్వారా ఈ తరగతుల అభివృద్ధికి, స్వయం ఉపాధికి నిధులు కేటాయించాలి
7. హంద్రీనీవాకు 80 టిఎంసిలు నీరు కేటాయించాలి. పిల్ల కాలువలు తవ్వి ఆయకట్టుకు నీరివ్వాలి.
8. రాయలసీమలో మైనింగు ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలి. మైనింగు ద్వారా వచ్చే ఆదాయంలో 50 శాతం రాయలసీమ ప్రాంతాభివృద్ధికి కేటాయించాలి
9. గత ప్రభుత్వ శాసనసభలో రాయలసీమకు ప్రకటించిన అభివృద్ధి పథకాలను పూర్తి చేయడంతోపాటు, కొత్త పరిష్కార చర్యలను చేపట్టాలి.
10. కార్పొరేట్ కంపెనీలకు వేల ఎకరాల ప్రభుత్వ భూములను అప్పజెప్పే విధానాన్ని ఆపాలి. గ్రామీణ ప్రాంతాల్లోని మిగులు భూమిని పేదలకు పంచాలి.

'రియల్ క్షేత్రం'గా గొర్రెల పెంపక కేంద్రం

ఇప్పటికే వైద్య కళాశాలకు 50 ఎకరాలు
మరో 50 ఎకరాలకు అహుడా ఎసరు
తేల్చేందుకు రేపు రానున్న ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయరంగాన్ని అంతో ఇంతో నిలబెడుతున్నది పశుపోషణ. గొర్రెలు, మేకల పెంపకం ప్రధానమైనది. అయితే ఈ రంగంపై ఎప్పటి నుంచో పాలకులకు శీతకన్ను ఉంది. ఈ రంగానాకి కాస్తోకూస్తో అండగా నిలుస్తున్న వాటిని కూడా లేకుండా చేసే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతుండటం గమనార్హం. గొర్రెలు, మేకల పెంపకంలో పెంపకందారులకు లాభదాయకమైన రకాలను ఉత్పత్తి చేసేందుకున్న పరిశోధన క్షేత్రం పెనుకొండ వద్ద ఉంది. దీన్ని 1959లో ఏర్పాటు చేశారు. ఈ క్షేత్రంలో గొర్రెల్లో మేలు రకాలైన వాటిని ఉత్పత్తి చేసి పెంపకందారులకు లాభదాయకం చేయాలన్న లక్ష్యంతో ఆనాడు 600 ఎకరాల భూమిని ఇక్కడ ఏర్పాటు చేశారు. ప్రారంభం నుంచి దీనికి అరకొరగానే నిధుల కేటాయింపులు జరుగుతున్నా..ఎంతోకొంత ప్రయత్నాలు అయితే సాగుతూ వస్తున్నాయి. మొదట ఆస్ట్రేలియా తరహా రకాలను ఇక్కడి ఉత్పత్తి చేసి అటు ఉన్ని, ఇటు మాంసం రెండూ వచ్చేవిధంగా చేయాలని ఆలోచించారు. అయితే ఇక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో వాటి పెంపకం సాధ్యపడలేదు. తరువాత కాలంలో నెల్లూరు బ్రౌన్ బ్రీడ్ రకాన్ని ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉత్పత్తి చేసే ప్రక్రియ ప్రారంభమైంది. అది ఇంకా కొనసాగుతూ ఉంది. ఈ క్రమంలోనే ఇక్కడున్న భూములను ఇతర వాణిజ్య అవసరాలకు ప్రభుత్వం కేటాయింపులు జరుపుతూ పోతోంది. దీంతో ఈ క్షేత్రం రాబోయే రోజుల్లో ఏమవుతుందోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

అహుడా ప్లాట్లకు కేటాయించే ప్రయత్నం

గొర్రెల పెంపకం క్షేత్రంలోనున్న 600 ఎకరాల భూమిలో నుంచి సర్వే నంబరు 1031లో మొదట వైద్యకళాశాల కోసమని 53 ఎకరాల భూమిని కేటాయించారు. ఇదే సర్వే నంబరులో 21 ఎకరాల భూమి ఉంది. దీన్ని కాదని ఇప్పుడు అహుడా ప్లాట్లుగా వేసి లేఅవుట్ అమ్మకాల కోసమని సర్వే నంబరు 1234, 1231లో 50 ఎకరాల భూమినివ్వాలని కోరుతోంది. ఈ స్థలంలో ఇది వరకే రూ.60 లక్షలు పెట్టి బోరువేసి, నీటి వసతి కల్పించియున్నారు. మరో కోటి రూపాయలతో గొర్రెల పెంపకందారులకు శిక్షణ కేంద్రం కూడా మంజూరైంది. ఇప్పుడు ఈ భూమిని ఇవ్వడానికి వీలుపడదని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే అదే భూమి కావాలని అహుడా పట్టుబట్టింది. దీంతో ఈ స్థలాన్ని పరిశీలంచేందుకు సత్యసాయి జిల్లా కలెక్టరు పి.బసంత్‌కుమార్, పశుసంవర్ధక శాఖ డైరెక్టరు శుక్రవారం నాడు గొర్రెల పెంపక క్షేత్రాన్ని పరిశీలించనున్నారు.

గొర్రెలను మేపడానికి తీసుకెళ్తున్న పెంపకందారులు (ఫైల్ ఫొటో)

రాష్ట్రంలోనే అత్యధిక పశుసంపద

రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా గొర్రెలు, మేకలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 22.94 లక్షల గొర్రెలు, 4.12 లక్షలు మేకలు ఉన్నాయి. సత్యసాయి జిల్లాలో 26.29 లక్షలు గొర్రెలు, 4.72 లక్షల మేకలు ఉన్నాయి. ఇంత పెద్దఎత్తున పశుసంపద ఉంది. ఇప్పుడున్న వాటిల్లో మరిన్ని పరిశోధనలు జరిపి మేలు రకాలైన గొర్రెల ఉత్పత్తి అవసరముందని నిపుణులు చెబుతున్నాయి. భారత వ్యవసాయ పరిశోధనా మండలి డిప్యూటీ జనరల్ అయ్యప్పన్ సైతం ఈ క్షేత్రాన్ని పరిశీలించి, దీనికి మరింత ప్రోత్సహాన్ని అందిస్తామని ఆనాడు ప్రకటించియున్నారు. ఇటువంటి క్షేత్రానికి బలోపేతం చేసుకోవాల్సింది పోయి ఉన్న వనరులను ఇతర వాటికి కేటాయించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

హెచ్‌ఎల్‌సికి అదనంగా 2.606 టిఎంసిలు

నీటి లభ్యత పెరగడంతో పెరిగిన కేటాయింపులు
రెండో పంట వద్దంటున్న జలవనరుల శాఖ అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ (హెచ్‌ఎల్‌ఎంసి)కి కేటాయింపులను మరో 2.606 టిఎంసిలు పెంచుతూ తుంగభద్ర బోర్డు నిర్ణయించింది. వర్షాలు ముందుగా అనుకున్న దాని కంటే అధికంగా వచ్చాయి. దీంతో నీటి లభ్యత పెరగడంతో దమాషా పద్ధతిలో తుంగభద్ర ఎగువ ప్రధాన కలువకు నీటి కేటాయింపులు పెంచారు. తుంగభద్ర బోర్డు పరిధిలోని ఇంజినీర్ల సమావేశం బుధవారం జరిగింది. జూమ్ కాల్‌లో ఆన్‌లైన్‌లో జరిగిన ఈ సమావేశంలో పై నిర్ణయం చేసినట్టు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఎస్ఇ రాజశేఖర్ తెలిపారు.

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ

ఈ ఏడాది అత్యధిక వరద

చాలా కాలం తరువాత ఈ ఏడాది తుంగభద్ర డ్యామ్‌కు అత్యధికంగా వరద వచ్చింది. మొత్తం ఇప్పటి వరకు ఈ ఏడాది 596.01 టిఎంసిల నీరు తుంగభద్ర డ్యామ్‌కు చేరింది. ఇందులో వరద రూపంలో దిగువకుపోగా 181 టిఎంసిల నీరు వినియోగానికి అనువుగా డ్యామ్‌లో అందుబాటులోకి వచ్చింది. సీజన్ ప్రారంభంలో ఈ ఏడాది 171 టిఎంసిలు అందుబాటులో ఉండవచ్చునని అంచనా వేశారు. దీనికి అదనంగా ఈ ఏడాది 188 టిఎంసిల నీరు సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునే విధంగా నీటి లభ్యత ఉంది. దీంతో బుధవారం నాడు జరిగిన రెండో విడత సమావేశంలో దామాషా పద్ధతిలో అన్ని ప్రధాన కాలువలకూ నీటి కేటాయింపులు పెంచుతూ నిర్ణయం చేశారు. ఇందులో తుంగభద్ర ప్రధాన కాలువకు 2.606 టిఎంసిల నీరు అదనంగా కేటాయించారు. అంతకు మునుపు మొదటి సమావేశంలో 26.215 టిఎంసిలు కేటాయించారు. కెసి కెనాల్ డైవర్షన్ ద్వారా మరో రెండు టిఎంసిలు కేటాయించారు. అంటే 28.215 టిఎంసిలు కేటాయించారు. ప్రస్తుం పునఃసమీక్ష తరువాత 2.606 టిఎంసిలు కేటాయించడంతో మొత్తం ఈ ఏడాది జిల్లాకు తుంగభద్ర ప్రధాన కాలువ ద్వారా వచ్చే నీరు 30.821 టిఎంసిలు కానుంది. ఇప్పటి వరకు తుంగభద్ర డ్యామ్ వద్ద 17.744 టిఎంసిలు వదిలారు. రాష్ట్ర సరిహద్దు వద్ద తీసుకున్నది మాత్రం 16.501 టిఎంసిలు పోనూ ఇంకా 13.965 టిఎంసిల నీరు జిల్లాకు తీసుకోవాల్సి ఉంది.

ఇప్పటికే జలాశయాల్లో నిండుగావున్న నీరు

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కిందనున్న ప్రాజెక్టుల్లో ఇప్పటికే నీరు పుష్కలంగా ఉంది. పిఎబిఆర్‌లో పూర్తి సామర్థ్యం 11 టిఎంసిలు. అయితే ఐదు టిఎంసిలకు మించి నిలువ ఉండటం లేదు. ఇప్పటికే 4.800 టిఎంసిల నీరు నిలువ ఉంది. ఎంపిఆర్‌లో 4.340 టిఎంసిలు, చిత్రావతిలో 9.108 టిఎంసిలు, మైలవరం 5.453 టిఎంసిలు, చాగల్లు 0.930 టిఎంసిలు, పెండేకల్లు 0.229 టిఎంసి, ఎస్ఎస్‌బిఆర్ 0.125 టిఎంసిలు నీరు ఉంది. ఈ విధంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కిందనున్న ప్రాజెక్టులన్నింటిలోనూ నీరు పుష్కలంగా ఉంది.

రెండో పంట వద్దు
రాజశేఖర్, హెచ్‌ఎల్‌సి ఎస్ఇ

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆయకట్టు కింద రైతులు రెండో పంటకు వెళ్లవద్దని కోరారు. రెండో పంట పెడితే మధ్యలో నీరు రాకపోతే రైతులు నష్టపోయే అవకాశముంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ఆయకట్టు కింద రెండో పంటకు వెళ్లవద్దని సూచిస్తున్నామని తెలిపారు.

కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి,యువజన సంఘాల నాయకులు

ఎస్ఎస్‌బిఎన్ కళాశాల ముట్టడి

ఐక్య విద్యార్థి, యువజన సంఘాల నాయకుల అరెస్టు, విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ కాలేజీలో జరిగిన స్కాలర్‌షిప్ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలని ఐక్య విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కళాశాలను ముట్టడించారు. తీవ్ర ఉద్రిక్తతల నడుమ పోలీసులు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర యాదవ్, ఎపిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర, ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పృథ్వీ, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి వీరేంద్ర, తెలుగు యువత పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బాల హరికృష్ణ యాదవ్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుత్తా ధనుంజయ నాయుడు, అనంత హక్కుల వేదిక రాహుల్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..కాలేజీలో స్కాలర్‌షిప్‌ల అక్రమాలపై విచారణ జరపాలని కోరితే విద్యార్థి, యువజన సంఘాల నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటు అన్నారు. విద్యార్థులకు చెందాల్సిన ప్రభుత్వ స్కాలర్‌షిప్‌ల మొత్తం కోటి రూపాయలను కళాశాల యాజమాన్యం ఇతర బ్యాంకు ఖాతాలకు మళ్లించిదన్నారు. దీనిపై కేసు కూడా నమోదు అయిందన్నారు. అది కాస్తా బయటకు పొక్కడంతో ఆయా సంక్షేమ శాఖల అధికారులు రంగంలోకి దిగి కళాశాలకు నోటీసులు కూడా జారీ చేశారన్నారు. దీంతో రూ.30 లక్షలు కళాశాల యాజమాన్యం వెనక్కు చెల్లించిందన్నారు. ఇంతకాలం రూ.లక్షల డబ్బు కళాశాల బ్యాంకు అకౌంట్లలో భద్రపరచగా వచ్చిన వడ్డీని యాజమాన్యం నుంచి వసూలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి, ఉద్యోగులు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రస్టు కార్యదర్శికి కళాశాల వ్యవహారాలలో సంబంధం ఉండదన్నారు. ఆ బాధ్యత కళాశాల కరస్పాండెంట్‌దే అని తెలిపారు. అయితే మొత్తం కర్ర పెత్తనం ట్రస్టు కార్యదర్శికే కరస్పాండెంట్ అప్పగించినట్లు కనిపిస్తోందన్నారు. కళాశాలలో జరిగిన అక్రమాలపై మాజీ ట్రస్టు సభ్యులు నాలుగు నెలల క్రితం కలెక్టరుకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కలెక్టర్ విచారణ కమిటీని నియమించారన్నారు. ఇంతవరకు ఆ కమిటీ నివేదికను బయటపెట్టలేదని చెప్పారు. కలెక్టర్ తక్షణం విచారణ కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని, యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించి కాలేజీని పరిరక్షించాలని కోరారు. యాజమాన్యాన్ని అరెస్టుచేసి దోచుకున్న సొమ్మును తిరిగి చెల్లించే వరకు ఐక్య విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, నాయకులు రామిరెడ్డి స్టేషన్‌కు వెళ్లి విద్యార్థి సంఘం నాయకులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఓతూరు పరమేష్, అష్రాఫ్ వలి, సంజీవ్, విజయ్, మారుతీ, రవిచరణ్, కమల్, అశోక్, రిషి, మధు, ఉపేంద్ర, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందున్నాం..

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అభివృద్ధిలో మనమే ముందంజలో ఉన్నామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో రూ.1.25కోట్లతో నిర్మించనున్న రోడ్లు, డ్రెయినేజీలు, సచివాలయ భవనాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు రాష్ట్రంలో ఇన్ని అభివృద్ధి పనులు చేస్తుంటే ప్రతిపక్షాలు విమర్శించడం బాధాకరమన్నారు. మండల కేంద్రంలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న రహదారి, డ్రెయినేజీల సమస్యను పరిష్కరించామన్నారు. అనంతరం ఇక్కడే రూ.16లక్షలతో వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీకి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తేజోష్ణ, సర్పంచి పార్వతి, ఎంపిపి దాసరి సునీత, జడ్పీటీసీ భాస్కర్, సింగిల్‌విండో ప్రెసిడెంట్ గువ్వల పెద్ద వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి రామ్‌గోపాల్, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, ఎంపిటిసి వెంకటశివారెడ్డి, వైసిపి నాయకులు రమణారెడ్డి, పూల రంగస్వామి, చికెన్ స్వామి, ముత్యాల శ్రీనివాసులు, రాజా, రేకులకుంట లక్ష్మీనారాయణ , మడకశిర చంద్రమోహన్, పసలూరు భయపరెడ్డి, ముత్యాల రంగనాథ్ మానేరు కొండమ్మ పరమేష్, సిఐ రాము, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

కుటుంబం ఆత్మహత్య కేసును నీరుగార్చేందుకు కుట్ర

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

నిరుపేద ముస్లిం కుటుంబం సామూహిక ఆత్మహత్య ఘటనలో వాస్తవాలను వెలికితీయాల్సిన పోలీసులు... తప్పుడు స్టేట్‌మెంట్‌తో కేసును పక్కదారి పట్టిస్తున్నారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. బొమ్మనహాల్ మండలంలోని ఉందకల్లు గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న ముస్లిం కుటుంబ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తున్న కాలవ శ్రీనివాసులును పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ముస్లిం కుటుంబం అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తున్న తనను పోలీసులు అడుగడుగునా అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. హెడ్‌కానిస్టేబుల్ రఘునాథరెడ్డి వేధింపుల వల్లే షేకున్‌బీ, మన్సూర్ బాషా కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. బళ్లారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన తల్లి షేకున్‌బీ, మన్సూర్ బాషా, సోదరుడు మహబూబ్ బాషా తమ కుటుంబం చావుకు రఘునాథరెడ్డి కారకుడని పదే పదే స్పష్టంగా చెప్పిన తర్వాతనే తాను మంగళవారం సాయంత్రం పరామర్శించాడానికి వెళ్లానన్నారు. బళ్లారిలో రూరల్ సి.ఐ యుగంధర్ సమక్షంలోనే కుటుంబ సభ్యులు విలేకర్లతో మాట్లాడారన్నారు. తరువాత సిఐ యుగంధర్ పలువిధాలుగా మహబూబ్‌బాషాను భయపెట్టి ముందు ఇచ్చిన స్టేట్మెంట్‌కు భిన్నంగా తమ కుటుంబం చావుకు మాఅన్న భార్య బంధువులేనని తప్పుడు స్టేట్మెంట్ ఇప్పించారన్నారు. ఈ ఘటనపై తాను రాజకీయ ప్రయోజనం ఆశించడం లేదన్నారు. ఎందుకంటే తన ప్రత్యర్థి విప్ కాపు రామచంద్రారెడ్డి కారణమని తానెక్కడా ఆరోపణలు చేయలేదన్నారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే రాయదుర్గానికి సంబంధం లేని పోలీసు ఉన్నతాధికారిని నియమించి, కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి హెడ్ కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బలరామిరెడ్డి, హనుమంతురెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ చంద్రహాస్, తిమ్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

సచివాలయాల పర్యవేక్షణపై సమీక్ష

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయాల పర్యవేక్షణపై కమిషనర్ బి.వి.నరసారెడ్డి నోడల్ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాల అమలు తీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో సచివాలయాల అధికారి ఇమామ్ హుస్సేన్,ఎఇ శరత్ చంద్ర, ఆర్ఓ వెంకటరెడ్డి ఆర్ఐలు షేక్షావలి రామాంజనేయులు, సుధాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

19న మండల సమావేశం

గుత్తి : ఈనెల 19వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ అవ్వరుగాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో 16 అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, మండల శాఖ అధికారులు హాజరు కావాలన్నారు.

20న అన్నదానం

గుత్తి : కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని చెరువు కట్ట వద్ద ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఈనెల 20న అన్నదానం చేయనున్నట్లు హనుమాన్ దీక్ష గురుస్వాములు ఎ.ఐ.స్వామి, ఎస్.గంగాధర్, ఆలయ అర్చకులు ప్రకాష్ ఆచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక బహుళ దశమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్షపరులచే ఆలయ ఆవరణలో అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగిస్తామని తెలిపారు.

పలువురు వైసిపిలో చేరిక

కళ్యాణదుర్గం : పట్టణంలోని వైసిపి కార్యాలయంలో కంబదూరు మండలం కర్తనపర్తి పంచాయతీ గుళ్లం గ్రామానికి చెందిన ఆరు కుటుంబాలు బుధవారం వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి మంత్రి ఉషశ్రీచరణ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసిపిలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

ఉరవకొండ : ప్రజాణికులను వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేర్చడమే ఆర్టీసీ ధ్యేయమని ఎపిఎస్ ఆర్టీసీ జోనల్ చైర్పర్సన్ ఎం.మంజుల అన్నారు. బుధవారం ఉరవకొండ ఆర్టీసీ డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికులతో స్నేహపూరితంగా మెలగాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలను పెంపొందించుకుని డిపో అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఉరవకొండ ఆర్టీసీ డిపోలో 49 బస్సులు ఉన్నాయని, అవి పూర్తిస్థాయి కండీషన్లో ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలోకి విలీనం చేయడం పట్ల ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోందన్నారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల తో సమానంగా వారికి అన్ని సౌకర్యాలు వర్తిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ బాలాజీ దయాల్, ఆర్టీసీ సిబ్బంది ఓబులేసు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న మంజుల

మహారాజశ్రీ ఆరవ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో:గుత్తి
O.S.No.21/2015
Between:
పొలికి లోకిరెడ్డి ...వాది
మరియు
ఎం.ఆదిలక్ష్మమ్మ (మరణించినది) మరియు ఇతరులు ...ప్రతివాదులు
To
1. ఎం.వెంకటేష్ S/o లేట్ ఎం.వెంకటాచలపతి, డోర్‌నెం. 10-317, మెయిన్‌రోడ్డు, గుంతకల్లు.
2. ఎం.సాయి S/o లేట్ ఎం.వెంకటాచలపతి, డోర్‌నెం.10-317, మెయిన్‌రోడ్డు, గుంతకల్లు.

ప్రతివాదులు నెం.6 మరియు 7లకు సమ్మన్

పై దావాను వాది దావా అగ్రిమెంట్ ఆఫ్ సేల్ అమలుకు గాను పై దావాను మొదటి ప్రతివాది యొక్క వారసులుగా మీపైన దాఖలు చేసియున్నారు. పై దావా మీ యొక్క హాజరు కొరకు తేది:25-11-2022న వాయిదా వేయబడినది. కావున పై వాయిదా తేదీన ఉదయం 10.30 గంటలకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీకేమైనా అభ్యంతరాలు ఉన్నచో తెలుపుకొనవచ్చును. లేని యెడల పై దావా మీ పక్షములో తీర్మానింపబడును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

జి.లక్ష్మీపతి
అడ్వకేట్, గుంతకల్లు.

In the Court of the Prl. Junior Civil Judge:Anantapuramu
O.S.No.685/2016
Between:
Sareddy Ramalinga Reddy ...Plaintiff
And
K.Ranganayakulu (Died) by his L.Rs
K.Sreedevi and Others ...Defendants

Notice to Defendants No:1,2&3

D1: K.Sreedevi W/o K.Ranganayakulu.
D2: K.Sirisha D/o Late K.Ranganayakulu, Student.
D3: K.Rama Krishna S/o Late K.Ranganayakulu, Student.

All are Residing at D.No.6-2-202, Kovur Nagar, Anantapuramu.

పై నెంబరు కేసులో ప్రతివాదులయిన మీ హాజరు నిమిత్తం 24-11-2022వ తేది ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఎన్.పి. శ్రీనివాసులు, వాదిపరం వకీలు
అనంతపురం, సెల్: 9440753607.

రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. బుధవారం నగరంలోని 6వ డివిజన్ పరిధిలో రూ.27 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ సహకారంతో నగరంలో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే గుత్తి రోడ్డు నాలుగు వరుసల రహదారి పనులు పూర్తి చేశామన్నారు. బళ్లారి బైపాస్ నుంచి నగరం మీదుగా పంగల్ రోడ్డు వరకు నాలుగు వరసల రహదారి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. వీటితోపాటు నగరంలోని ప్రధాన రహదారుల విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. సిఎం జగన్ సహకారంతో రూ.25 కోట్ల నిధులు నగరాభివృద్ధికి వినియోగిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గడప గడపకూ కార్యక్రమంలో వస్తున్న సమస్యల పరిష్కారానికి ఒక్కో సచివాలయానికి రూ.20లక్షల చొప్పున నిధులు విడుదలవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, విజయ్‌భాస్కర్‌రెడ్డి, మాజీ మేయర్ రాగే పరశురాం, కార్పొరేటర్లు సుజాత, కమల్‌భూషణ్, బాబా ఫకద్దీన్, నాగమణి, లీలావతి, ఇఇ సతీష్, డిఇ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలను పరామర్శిస్తే తప్పా..

'మాజీమంత్రి కాలవ'ను అడ్డుకోవడం బాధాకరం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని ఉంతకల్లు గ్రామంలో ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన కుటుంబానికి పరామర్శించేందుకు వస్తున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులను అడ్డుకోవడం బాధాకరమని టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వస్తున్న కాలవ శ్రీనివాసులును కర్ణాటక సరిహద్దులోనే అడ్డుకుని కర్ణాటకకు తిప్పి పంపడం బాధాకరమన్నారు. పోలీసుల దురుసు ప్రవర్తన వల్లే కుటుంబం ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. వారి మృతికి కారకులైన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతోపాటు కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మల్లికార్జున, అప్పారావు, గోనేహాల్ కేశవరెడ్డి, ఎల్బీనగర్ ధనుంజయ, మోహన్, ఉంతకల్ కించప్ప, తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రి కాలవ శ్రీనివాసులును బలవంతంగా ఆర్టీసీ బస్సులో నుంచి దింపుతున్న పోలీసులు

జ్ఞానాన్ని పెంపొందించుకునే ఆలయాలే గ్రంథాలయాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

చిన్నప్పటి నుంచే జ్ఞానాన్ని పెంపొందించుకునే ఆలయాలే గ్రంథాలయాలు అని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి అన్నారు. గ్రంథాలయ జాతీయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని కోటవీధిలో ఉన్న గ్రంథాలయలో గ్రంథాలయ ఉద్యమకారులైన గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఎస్సార్ రంగనాథ్, అయ్యంకి వెంకటరమణయ్య, పోతూరి నాగభూషణ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాల్యం నుంచే పుస్తకాలు చదవడం, రాయడం నేర్చుకోవాలన్నారు. రోజూ కనీసం అర్ధగంట గ్రంథాలయాన్ని సందర్శిస్తే విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్‌ఎం మోహన్ రెడ్డి, గ్రంథాలయ ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, ఉపాధ్యాయుడు తిరుమలరావు, గ్రంథాలయ అధికారులు శ్రీనివాసులు, వందన, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ ఉద్యమకారులైన గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, ఎస్.ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జయరాం, పాఠకులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాయదుర్గం : గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మూడవరోజు బుధవారం పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి ఆదిలక్ష్మి, విద్యార్థులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమాదేవి

సిపిఎం ఆధ్వర్యంలో అంత్యక్రియలు

గార్లదిన్నె : గుండెపోటుతో మృతిచందిన మండల పరిధిలోని కల్లూరు సుందరయ్య కాలనీకి చెందిన గుజిరి చంద్ర అంత్యక్రియలను బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. చంద్ర చనిపోయినట్లు తెలుసుకున్న సిపిఎం నాయకులు ఓబులేసు, కార్యదర్శి శంకర, ఐద్వా సంఘం అధ్యక్షురాలు సుశీలమ్మ, కార్యదర్శి సుభద్రమ్మ, వికలాంగుల సంఘం మండల కార్యదర్శి రంగనాథ్, సుందరయ్య కాలనీ కమిటీ సభ్యుడు వంశీ సభ్యుడు నరసింహనాయక్ వీరితోపాటు సభ్యులందరూ తమవంతు సాయం చేసి అంత్యక్రియలు చేశారు. అనంతరం కుటుంబానికి భరోసా కల్పించారు.

కెవిపిఎస్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

గుత్తి : కుల వివక్ష పోరాట సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పట్టణంలోని జెడ్.వీరారెడ్డి భవనంలో జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజన సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామన్నారు. దేశంలో దళితులు,గిరిజనులపై దాడులు పెరిగిపోయాయని చెప్పారు. వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కెవిపిఎస్ కార్యాచరణపై ఈనెల 17న గుత్తిలో మండల మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 23, 24వ తేదీల్లో గుంతకల్లులో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసభలకు దళిత, గిరిజనులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మున్ని, కేవీపీఎస్ నాయకులు రంజిత్ కుమార్, కుళ్లాయప్ప, మారి రమణ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలును రాజధాని చేయాలి

రాయదుర్గం: రాష్ట్ర ప్రజలందరి సౌకర్యం దృష్ట్యా కర్నూలును రాష్ట్ర రాజధాని చేయాలని కోరుతూ రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాయదుర్గం డివిజన్ కార్యదర్శి ఎస్‌వి ఆంజనేయులు బుధవారం పట్టణంలో రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పరిపాలన రాజధానిని చేయడం వల్ల రాయలసీమ వాసులకు దూరం ఎక్కువ అవుతుందన్నారు. ఫలితంగా తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు ప్రజలందరికీ సౌకర్యవంతమైన కర్నూలు రాజధాని చేయాలని కోరారు.

డంపింగ్ యార్డు పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను కమిషనర్ భాగ్యలక్ష్మి బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా యార్డులో వ్యర్థాల నిర్వహణ క్రమ పద్ధతి లో సక్రమంగా చేయాలని సూచించారు, ఈ సందర్భంగా ప్లాస్టిక్ రీసైక్లింగ్ విధానం యూనిట్‌ను (బయోమైనింగ్ ద్వారా లెగసె వేస్టును ఎరువుగా తయారు చేసే యూనిట్‌ను) పరిశీలించి అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. అనంతరం నగరంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ, వార్డుల్లో పారిశుధ్యాన్ని పర్యవేక్షించారు. నగరపాలక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు చెత్తను డంపింగ్ యార్డుకు నిర్దేశించిన సమయంలో తరలించేందుకు చర్యలు చేపట్టాలని కార్యదర్శులు, ఇన్స్‌పెక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఆరోగ్యాధికారి గంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొనారు.

పెన్నహోబిలంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో ఈవో విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఇందులో భాగంగా ఆలయం చుట్టూ, మాడావీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కర్నూలును రాజధానిగా ప్రకటించాలని వినతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కర్నూలును రాజధానిగా ప్రకటించాలని రాయలసీమ కమ్యూనిస్ట్ పార్టీ (ఆర్‌సిపి) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎత్తున ఆందోళన చేపట్టి తహశీల్దార్ శంకరయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి నాయకులు ఆంజనేయులు, కొల్లాపురప్ప మాట్లాడుతూ 1960కు ముందు కర్నూలు రాజధానిగా కొనసాగిందన్నారు. ఆ తర్వాత హైదరాబాద్ ను కొనసాగించారని. అప్పటి మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కర్నూలు రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిపి నాయకులు నాగమణి, కొల్లాపురమ్మ, మనోజ్, మహేంద్ర, వన్నూరుస్వామి, మారెప్ప, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛవ్యాధిపై అపోహలు వీడాలి

న్యూరాలజిస్ట్ జాషువా కాలేబ్ కెలి - జాతీయ ఎపిలెప్సీ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

ఎపిలెప్సి (మూర్ఛ, వాయి జబ్బు)పై ప్రజల్లో అనేక అపోహలున్నాయని, వాటిని వీడాలని న్యూరాలజిస్టు జాషుబా కాలేబ్.కెలి అన్నారు. జాతీయ ఎపిలెప్సీ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో వైద్య విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెంది మూర్ఛవ్యాధి నియంత్రణకు ఎన్నో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. చికిత్స చేయించుకుంటే మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. మందులతో తగ్గని ఫిట్స్‌కు సర్జరీ ద్వారా కూడా నయం చేయవచ్చన్నారు. వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం నవంబర్ 17న జాతీయ ఎపిలెప్సీ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. మొదడులోని ఒక భాగంలో అవసరానికి మించి విద్యుత్‌శక్తి ఉత్పత్తి అవడం వల్ల ఫిట్స్ వస్తాయన్నారు. ఈ జబ్బు ఉన్న ఎవరైనా పెళ్లిళ్ల చేసుకోవచ్చన్నారు. అయితే మహిళలు గర్భిణులుగా ఉన్నప్పుడు మందులు వాడాలన్నారు.

పంట కోత ప్రయోగాలపై అవగాహన అవసరం

బెళుగుప్ప : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో పంటకోత ప్రయోగాలపై విఆర్‌ఓలు, వ్యవసాయ శాఖ సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఈశ్వరశెట్టి మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వద్దని సూచించారు. వ్యవసాయ అధికారి పథ్వీసాగర్ పంటకోత ప్రయోగాలు నిర్వహించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, ఎంపీఈవోలు తిమ్మారెడ్డి, ప్రవీణ్‌కుమార్, శ్రావణి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన

గార్లదిన్నె : అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి అధ్యక్షతన బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలల సంక్షేమ సమితి ఛైర్‌పర్సన్ రామలక్ష్మి బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాలు, హెల్ప్‌లైన్ నెంబర్లు తదితర వాటిపై వివరించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సర్వసభ్య సమావేశం

శింగనమల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి యోగేశ్వరి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది. ముందుగా జూలాకాలువ సర్పంచి రాజారామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడంలో వ్యవసాయ అధికారులు వైఫల్యం చెందారని నిలదీశారు. దీంతో వ్యవసాయ అధికారి నిర్లక్ష్య సమాధానం ఇవ్వడంతో ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే గుమ్మేపల్లి సర్పంచి డేగల లలితమ్మ మాట్లాడుతూ గుమ్మేపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని విన్నివించుకున్నారు. ఈరెండు సమస్యలు తప్ప మిగతా అభివృద్ధి పనులపై చర్చ జరగకపోవడం బాధాకరం. ఈనేపథ్యంలో తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం ముగించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపిడిఒ నిర్మలాకుమారి, ఇఒఆర్‌డి శివనారాయణరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, రమేష్, డేగల లలితమ్మ, ఎంపిటిసి మురాజీ ఓబులేసు, ప్రభుత్వ అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు : డీఎస్పీ

గుత్తి : విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తాడిపత్రి డిఎస్పీ చైతన్య హెచ్చరించారు. బుధవారం స్థానిక గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ చేసి విద్యార్థులు భవిష్యత్ నాశనం చేసుకోరాదన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే. పద్మావతమ్మ, ప్రిన్సిపల్ అరవింద్, పామిడి సీఐ రామకృష్ణ, పెద్దవడుగూరు ఎస్సై రామకష్ణారెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రణాళికతో విద్యనభ్యసించాలి

రాయదుర్గం రూరల్ : విద్యార్థులు ప్రణాళికాబద్దంగా విద్యనభ్యసిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని రాయదుర్గం, కళ్యాణదుర్గం డిగ్రీ కళాశాలల ప్రిన్సిపళ్లు రఘురాంరావు, జయరామిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు విద్యార్థి ప్రేరణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విలువలు, నైపుణ్యాలను రూపొందించుకుంటే ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు సంపాదించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, కిరణ్, ఫరీసా, నాగిరెడ్డి, శ్రీదేవి, రుక్మిణీబాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, రామకృష్ణ, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ని కలిసిన శింగనమల యువత

శింగనమల : తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు యువసేన నాయకులు బుధవారం ఉండవల్లిలోని నివాసంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు, బాదుడే బాదుడు కార్యక్రమాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందుకు లోకేష్ స్పందిస్తూ కష్టపడి పని చేయాలని, రానున్న రోజుల్లో తమదే అధికారం అని చెప్పారన్నారు. అంతేగాకుండా తన పాదయాత్రకు సిద్ధంగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. లోకేష్‌ను కలిసిన వారిలో మండల టిడిపి యువనాయకులు యం.ఆదినారాయణ, అనంతపురం పార్లమెంట్ బిసి సెల్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, గ్రామ కమిటీ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, కాయల సురేష్ యాదవ్, వడ్డే పవన్, మైనార్టీ సెల్ కార్యనిర్వాహకార్యదర్శి మహమ్మద్ గౌస్, ఐటిడిపి, ఛాంపియన్ ముని, నవీన్, కిరణ్‌కుమార్, అఖిల్, హర్ష తదితరులు ఉన్నారు.

డాక్టర్ రామకృష్ణ నాయుడుకు సన్మానం

గుంతకల్లు : శ్రీశంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణనాయుడును కళాశాల ప్రిన్సిపల్ గోపాల్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాబోధనతోపాటు కళాశాల అభివృద్ధికి రామకృష్ణనాయుడు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణయ్య, అధ్యాపక బందం, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

నార్పల : మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో హాకీ క్రీడలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బుధవారం క్రీడా సామగ్రి అందజేశారు. హాకీ కర్రలు, హాకీ గోల్ కీపర్ కిట్లు, బాల్స్, షింగార్డ్, రౌండ్ మార్కర్ కోన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-శింగనమల

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు తరిమెల గిరి, అధ్యక్ష, కార్యదర్శులు సూర్యప్రకాష్, గంగాధర్ స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సి హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ మండల 1వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎక్కడ ఏ విద్యార్థికి సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బైజూస్ ఒప్పందాన్ని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాఠశాలలు ఇంటర్ కళాశాలలు తెరిచి ఆరునెలలు కావస్తున్నా ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మండల కార్యదర్శిగా సూర్యప్రకాష్, అధ్యక్షులుగా గంగాధర్, సహాయ కార్యదర్శిగా బాబా ఫక్రుద్దీన్, 10 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సందీప్, నిరంజన్, ఆదిత్య, నరేంద్ర, రాజ్‌కుమార్, సాయి, శామ్యూల్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ

పెద్దపప్పూరు : మండలంలోని చీమలవాగుపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సిడిపిఒ సహజదాబేగం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీశారు. పిల్లల పట్ల ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిటిసి సూపర్‌వైజర్ దస్తగిరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దుష్టశక్తులతో పోరాటానికి సిద్ధం

వికేంద్రీకరణతోనే అభివృద్ధి సాధ్యం : వైసిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

తరతరాలుగా వెనుకబడిన రాయలసీమ అభివృద్ధి కోసం దుష్టశక్తులతో పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శ్రీబాగ్ ఒడంబడిక చేసుకుని 85 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలోని లలిత కళాపరిషత్ ఆవరణలో ఉన్న కల్లూరు సుబ్బారావు విగ్రహం వద్ద అభివృద్ధి వికేంద్రీకరణ సాధన జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధికి శ్రీబాగ్ ఒప్పందం ఓ దిక్సూచి అన్నారు. శ్రీబాగ్ ఒప్పందం చేసుకుని 85 ఏళ్ల అవుతున్నా ఇప్పటికీ రాయలసీమకు సరైన న్యాయం జరగలేదన్నారు. ముఖ్యంగా నదీజలాలు, రాజధాని, హైకోర్టు విషయంలో రాయలసీమకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీబాగ్ ఒప్పందంలో ఉన్నాయన్నారు. 2014లో మరోసారి రాష్ట్ర విభజన జరిగిందన్నారు. విభజన తర్వాత టీడీపీ, బీజేపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయని, జనసేన మద్దతుగా ఉందన్నారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీబాగ్ ఒప్పందాన్ని పట్టించుకోకుండా రాజధాని, హైకోర్టును అమరావతిలోనే పెట్టారన్నారు. శ్రీబాగ్ ఒప్పందం మేరకు నదీజలాల విషయంలో రాయలసీమకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. వీటన్నింటినీ గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వికేంద్రీకరణ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. అందులో భాగంగా పరిపాలన రాజధానిగా విశాఖపట్నం, శాసన రాజధానిగా అమరావతి, న్యాయ రాజధానిగా కర్నూలును చేయాలని ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివద్ధి చెందాలన్న ఏకైక లక్ష్యంతో జగన్ ముందుకు వెళ్తుంటే అనేక అడ్డంకులు సష్టిస్తున్నారని మండిపడ్డారు. ఈదీక్షలో అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి అధ్యక్షుడు కేవీ రమణ, ఉమ్మడి జిల్లా జేఏసీ కన్వీనర్ రామిరెడ్డి, ఎల్‌కేపీ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, జేఏసీ సభ్యుడు కేపీ కుమార్, పాణ్యం సుబ్రమణ్యం, కో కన్వీనర్ హనుమన్న, రజక కార్పొరేషన్ ఛైర్మన్ మీసాల రంగన్న, మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వైసీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, పలు ప్రజా సంఘాల నేతలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉరవకొండ : వికేంద్రీకరణతోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండల పరిధిలోని బుదగవిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాల్లో పరిపాలన వికేంద్రీకరణ చేపట్టాలని చెప్పారని గుర్తు చేశారు. శ్రీబాగ్ ఒప్పందం దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఒక రాజధాని వద్దు.. మూడు రాజధానులు ముద్దు' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందా చంద్రమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, జెడ్పిటిసి ఎసి పార్వతమ్మ, సర్పంచి లక్ష్మీదేవి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వైస్‌ఛైర్మన్ సుంకన్న, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, వైసిపి నాయకులు ధనంజయ, భీమేష్, శివగంగ, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, కెపి రామాంజనేయులు, లింగప్ప, సురేష్, బి.యం.ధనుంజయ్య, ఓబన్న, బ్యాంకు ఓబులేసు, మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, గోవిందు, అంజి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : పరిపాలన వికేంద్రీకరణతోనే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. వికేంద్రీకరణకు మద్దతుగా ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ కూడలి వరకూ సాగింది. అక్కడ అంబేద్కర్, వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మానహారం నిర్మించి 'ఒక రాజధాని వద్దు.. మూడు రాజధానులు ముద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికేంద్రీకరణ అనేది ప్రజల ఆకాంక్ష అన్నారు. వికేంద్రీకరణలో భాగంగా మూడు రాజధానులతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి అని భావించిన సిఎం జగన్ అందుకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నారన్నారు. అంతేగాకుండా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా భావించి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కులాలు, మతాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా మహా సామాజిక విప్లవం తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యోగేశ్వరి, సొసైటీ బ్యాంకు ఛైర్మన్ శ్రీరామిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పట్నం నగేష్, నాయకులు పరంధామరెడ్డి, శెట్టిపల్లి నరసింహారెడ్డి, పేట శివారెడ్డి, మురాజి, రాజారామ్మోహన్‌రెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, నిదనవాడ రామాంజనేయులు, శివసుబ్బారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, బద్దూనాయక్, శివశంకర్‌రెడ్డి, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు